చదువుల తల్లి వల్లెలాంబదేవి

- నేటి నుంచి ఉగాది ఉత్సవాలు ప్రారంభం
- 30న అమ్మవారి రథోత్సవం

కోడుమూరు రూరల్: కోడుమూరు పట్టణంలో హంద్రీనది ఒడ్డున వెలసిన వల్లెలాంబదేవి చదువుల తల్లిగా విరాజిల్లుతోంది. అమ్మవారి సన్నిధిలో చదువుకున్నా, ఆశీస్సులు పొందినా మంచి మార్కులొస్తాయని, ఉన్నత ఉద్యోగాలొస్తాయన్నది ఇక్కడి ప్రజల ప్రగాఢ విశ్వాసం. ఈ ప్రాంతంలో ఉన్నత చదువులు, ఉద్యోగాలకు సిద్ధమయ్యే చాలామంది విద్యార్థులు, యువకులు అమ్మవారి ఆశీస్సులు తీసుకుని వెళుతుంటారు. అలాగే చిన్నారులకు తమ తల్లిదండ్రులు అమ్మవారి సన్నిధిలోనే అక్షరాభ్యాసం చేయిస్తుంటారు. అమ్మవారి మీద విశ్వాసంతో ఏడాదికేడాది దర్శించుకునే వారి సంఖ్య పెరిగిపోతుండడంతో వల్లెలాంబదేవి ఆలయం సీమ బాసరగా విరాజిల్లుతోంది.

మొదటి వల్లె సమర్పించడం వల్లే..

క్రీ.శ 1036లో చాళుక్య రాజు సత్యాశ్రయుని కాలంలో వల్లెలాంబదేవి ఆలయం నిర్మించినట్లు ఇక్కడి శిలాశాసనం ద్వారా తెలుస్తోంది. గ్రామంలో వస్త్రాలు నేసే వారికి ఈమె కుల దేవత అని వారు నేసిన మొదటి వల్లెను అమ్మవారికి సమర్పించే వారు గనుక వల్లెలాంబ అని ప్రతీతి. దేవాలయంలో నాటి పండితులు శిష్యులచే వేదాలు వల్లె వేయించేవారు గనుక ఈ దేవికి వల్లెలాంబ అని పేరు వచ్చిందనేది మరో అభిప్రాయం.

29 నుంచి ఉత్సవాలు

ఉగాది పురస్కరించుకొని వల్లెలాంబదేవి ఆలయంలో ఈ నెల 29వ తేదీ నుంచి 31వ తేదీ వరకు అమ్మవారి ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్, జెడ్పీటీసీ రఘునాథ్‌రెడ్డి తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా 29వ తేదీ శనివారం గోపూజ, గణపతి పూజ, పుణ్యాహవాచనం, గంగపూజ, సాయంత్రం ప్రభోత్సవం, 30వ తేదీ ఆదివారం సాయంత్రం అమ్మవారి రథోత్సవం, 31న పారువేటతో ఉత్సవాలు ముగుస్తాయని రఘునాథ్ రెడ్డి తెలియజేశారు.

క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు

వల్లెలాంబ దేవి తిరునాల సందర్భంగా 30న జరిగే ముగ్గుల పోటీల్లో గెలుపొందిన ముగ్గురు విజేతలకు వరుసగా రూ.3 వేలు రూ.2 వేలు, రూ.1000 విలువ చేసే పట్టు చీరలను దాతల సహకారంతో బహూకరిస్తారు. అలాగే 30వ తేదీ సాయంత్రం ఎస్ఎన్ఆర్ హెచ్‌పీ గ్యాస్ సహకారంతో నృత్య ప్రదర్శన కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటు చేశారు. 31న నిర్వహించే పొట్టేళ్ల పోటీల్లో విజేతలకు మొదటి బహుమతిగా రూ.20 వేలు, 2, 3, 4, 5వ బహుమతులుగా రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.5 వేలను అందించనున్నారు.


ప్రశాంత వాతావరణంలో వల్లెలాంబదేవి ఆలయం (ఇన్‌సెట్) వల్లెలాంబదేవి


అమ్మవారి రథం

వల్లెలాంబదేవి మహిమలు

గొల్లాపిన్ని కవి పండితా వంశానికి వల్లెలాంబదేవి కులదేవత. వీరి వంశీయుడైన మోటప్ప అనే బ్రాహ్మణుడికి విద్య అబ్బలేదు. నిరక్షరాస్యుడు అని ఎగతాళి చేస్తుంటే సహించలేని అతడు ఓ రోజు రాత్రి వల్లెలాంబ గుడిలో తలుపులు బిగించుకుని కూర్చున్నాడు. రాత్రి వేళ నగర సంచారానికి వెళ్లి తిరిగి వచ్చిన వల్లెలాంబదేవి గుడి తలుపులు తీయకుండా మొండిగా కూర్చున్న మోటప్పను హంద్రీనదిలోకి విసిరికొట్టింది. తిరి గి మరుదినం కూడా అతడు గుడిలో తలుపులు బిగించుకుని కూర్చున్నాడు. అమ్మవారు తిరిగి అతడిని హంద్రీనదిలోకి విసిరికొట్టింది. ఇలా మూడు రోజులు జరిగాకా మోటప్ప పట్టుదలను గమనించి అమ్మవారు అతడి సమస్యను తెలుసుకుని సంపూర్ణ అక్షర జ్ఞానం కలిగించడమేగాక, ఆ వంశానికి సంబంధించి ఏడు తరాలు పండిత పుత్రులుగా విరాజిల్లుతారని ఆశీర్వదించినట్లు గొల్లాపిన్ని వంశస్తుల కథనం. గొల్లాపిన్ని వంశస్తులు హైదరాబాద్, బెంగుళూరు, నంద్యాల, అనంతపురం ప్రాంతాల్లో స్థిరపడ్డారు. ఏడాదికోరోజు వచ్చి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి వెళుతుంటారు.

క్లుప్తంగా

'పది' పరీక్షకు 15 మంది గైర్హాజరు


సి.బెళగల్ మోడల్ స్కూల్ పరీక్ష కేంద్రంలోకి లైన్‌లో వెళ్తున్న విద్యార్థులు

సి.బెళగల్: మండలంలో శుక్రవారం జరిగిన పదో తరగతి పబ్లిక్ పరీక్షకు 15 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆయా పరీక్ష కేంద్రాల నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం జీవశాస్త్రం పరీక్ష నిర్వహించగా కొత్తకోట జెడ్పీ హైస్కూల్ పరీక్ష కేంద్రం, ఏపీ మోడల్ స్కూల్, సి.బెళగల్ జెడ్పీ హైస్కూల్‌లో నలుగురు చొప్పున విద్యార్థులు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో ముగ్గురు కలిపి మొత్తం 15 మంది గైర్హాజరైనట్లు ఆయా పరీక్ష కేంద్రాల నిర్వహణ అధికారులు వంశీమోహన్, బలరాముడు, రఘురామిరెడ్డి, మల్లయ్య తెలిపారు.

సేంద్రియ సాగుపై అవగాహన


గుండ్రేవులలో మాట్లాడుతున్న ఏఓ మల్లేష్‌కుమార్

సి.బెళగల్: ప్రజలు తమ ఇంటి పెరట్లో సేంద్రియ పద్ధతిలో కూరగాయలను సాగు చేయాలని మండల వ్యవసాయ అధికారి (ఏఓ) మల్లేష్‌కుమార్ సూచించారు. శుక్రవారం గుండ్రేవుల గ్రామ సచివాలయ ఆవరణలో సుస్థిర వ్యవసాయ కేంద్రం (సీఎస్‌ఏ), కొండాపురం గ్రామానికి చెందిన తుంగభద్ర సేంద్రియ రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో రైతు క్షేత్ర దినోత్సవం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ.. సుస్థిర వ్యవసాయ పద్ధతులు, గృహ ఆవరణలో కూరగాయల సాగు, వాటి లాభాలను వివరించారు. సీఎస్‌ఏ అధికారి రవికుమార్ రసాయన ఎరువులతో వ్యవసాయం, ప్రకృతి వ్యవసాయానికి ఉన్న వ్యత్యాసాన్ని వివరించారు. వీఏఏలు సోమేశ్వరి, ఎంపీఈఓ వెంకటేశ్వర్లు, సీఎస్‌ఏ సిబ్బంది పాల్గొన్నారు.

సెలవు రోజుల్లోనూ రిజిస్ట్రేషన్ సేవలు

పాణ్యం: ఈ నెల 30, 31వ తేదీల్లో రిజిస్ట్రార్ కార్యాలయాలు పనిచేస్తాయని పాణ్యం సబ్ రిజిస్ట్రార్ నరేంద్రరాజు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ఉగాది, రంజాన్ పండుగల సందర్భంగా రెండు రోజులు సెలవు అయినప్పటికీ 2024–25 ఆర్థిక సంవత్సరంలో ఈ నెలాఖరుతో ముగియనున్న దృష్ట్యా ఆది, సోమవారాలను ప్రభుత్వం పని రోజులుగా ప్రకటించిందన్నారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు యథావిధిగా ఆస్తుల క్రయ, విక్రయాలకు సంబంధించి రిజిస్ట్రేషన్ సేవలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.

2 నుంచి దస్తగిరిస్వామి ఉరుసు

పాణ్యం: మండల పరిధిలోని ఎస్. కొట్టాల గ్రామంలో వెలసిన హజరత్ దస్తగిరి స్వామి ఉరుసు ఏప్రిల్ 2వ తేదీ నుంచి ప్రారంభం కానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తొలి రోజు గంధం సమర్పణ, 3వ తేదీ ఉరుసు ఉంటుందన్నారు. అదే రోజు గుండు పందెం జరుగుతుందని పేర్కొన్నారు. ఉరుసు సందర్భంగా రాష్ట్ర స్థాయి మహిళా ఓపెన్ కబడ్డీ పోటీలు నిర్వహిస్తామన్నారు. విజేతలకు వరుసగా రూ.40 వేలు, రూ.30 వేలు, రూ. 20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.4 వేల చొప్పున బహుమతులు అందజేస్తామని వెల్లడించారు. 4వ తేదీ రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు జరుగుతాయన్నారు.

వీల్‌చైర్ విరాళం

పాణ్యం: మండల కేంద్రంలోని సీహెచ్‌సీకి మండల కో–ఆప్షన్ సభ్యుడు జాకీర్ ఉసేన్ సోదరుడు మహబూబ్‌ఉసేన్ జ్ఞాపకార్థం శుక్రవారం వీల్‌చైర్ అందజేశారు. ఆస్పత్రికి వచ్చే గర్భిణులు, బాలింతలు, దివ్యాంగులు, రోగుల సౌకర్యార్థం వీల్‌చైర్ అందించినట్లు తెలిపారు.

ట్రూఅప్ చార్జీలను రద్దు చేయాలి


విద్యుత్ ఏఈ సునీల్‌బాబుకు వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

ఓర్వకల్లు: ట్రూ అప్ సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై వేస్తున్న విద్యుత్ భారాన్ని రద్దు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి నాగన్న డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాగన్న మాట్లాడుతూ.. పేదలపై విద్యుత్ భారం మోపడం సరికాదన్నారు. అడ్డగోలు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం హామీలను విస్మరించడం దారుణమన్నారు. ఇప్పటికైనా ట్రూ అప్ సర్దుబాటు చార్జీలను రద్దు చేయాలని, స్మార్టు మీటర్లు అమర్చే ఆలోచనను ఉపసంహరించుకోవాలని, సెకి ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం విద్యుత్‌శాఖ ఏఈ సునీల్ బాబుకు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో మధుసూదన్, నాగరాజు, శ్రీరాములు, వెంకటేశ్వర్లు, ఉస్సేన్, సురేష్, ఎలీషా తదితరులు పాల్గొన్నారు.


దాతృత్వానికి ప్రతీక రంజాన్


ముస్లింలతో కలిసి ప్రార్థన చేస్తున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: దాతృత్వానికి ప్రతీక రంజాన్ అని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కల్లూరు అర్బన్ శేషాద్రి నగర్‌లో వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా మైనారిటీ అధ్యక్షుడు యూనుస్ బాషా స్వగృహంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి కాటసాని రాంభూపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. రంజాన్ మాసంలో రోజంతా ఉపవాసం ఉన్న ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్పొరేటర్ నాగ లక్ష్మిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు గోపాల్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొండను కొల్లగొట్టేస్తున్నారు!

కల్లూరు: పట్టా భూమి, డి.పట్టా (అసైన్డ్ భూములు), ప్రభుత్వ భూముల్లో ఖనిజాలు, గ్రావెల్ తీసుకోవాలంటే ప్రభుత్వ నిబంధనల ప్రకారం మైనింగ్‌శాఖ నుంచి అనుమతులు తీసుకోవాలి. భూముల్లోని ఖనిజాలు, ఇతర గ్రావెల్, కంకర వంటివి ప్రభుత్వ అవసరాల నిమిత్తం వాడుకోవాలనుకున్నా అనుమతి తీసుకుని రాయల్టీ చెల్లించాలి. అయితే కొందరు అక్రమార్కులు కల్లూరు మండలం తడకనపల్లె గ్రామం హంద్రీనీవా కాలువకు ఎదురుగా ఉన్న కొండను ఇటాచీలతో తవ్వుతూ మట్టిని ట్రక్కుల్లో ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. కూటమి నాయకుల అండదండలతో మట్టిని తవ్వుతున్నారని గ్రామంలో ప్రజలు చర్చించుకుంటున్నారు. తవ్విన గ్రావెల్ మట్టిని ఇతర ప్రాంతాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మట్టిని కర్నూలు నగరంలోని వెంచర్లకు తరలిస్తున్నారని సమాచారం.


ఇటాచితో మట్టిని తవ్వుతున్న దృశ్యం

ఇలా ఉంటే రోగాలు రావా..!


మురుగు కాల్వను శుభ్రం చేసుకుంటున్న మహిళ


గడిగరేవుల బీసీ కాలనీలో నిల్వ చేరిన మురుగు

గడివేముల: మండల పరిధిలోని గడిగరేవుల బీసీ కాలనీలో డ్రైనేజీలు మురుగునీటితో నిండి దుర్వాసన వెదజల్లుతోందని కాలనీవాసులు వాపోతున్నారు. కొద్ది రోజుల నుంచి డ్రైనేజీలు నిండడంతో కాలనీవాసులే శుభ్రం చేసుకుంటున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు డ్రైడేను ఫొటోలు మాత్రమే తీసుకుని ఆన్‌లైన్ అప్‌లోడ్ చేసుకుంటున్నారు తప్ప గ్రామాల్లో మాత్రం పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టడం లేదని ఆరోపిస్తున్నారు. స్థానిక పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి డ్రైనేజీలను శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్‌ను చల్లాలని కాలనీవాసులు కోరుతున్నారు.

చట్టవ్యతిరేక పనులకు దూరంగా ఉండాలి

ఓర్వకల్లు: గిరిజన ప్రాంతాలకు చెందిన యువత చట్టవ్యతిరేక పనులకు దూరంగా ఉండాలని తహసీల్దార్ విద్యాసాగర్ సూచించారు. మండలంలోని గుడుంబాయి తండాకు చెందిన 7 మంది యువకులు నాటుసారా విక్రయిస్తూ పోలీసులకు పట్టుబడ్డారు. ఎక్సైజ్ పోలీసులు బైండోవర్ కేసులు నమోదు చేశారు. నవోదయం-2లో భాగంగా ఆ శాఖ ఎస్ఐ రహెనాబేగం ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ ఎదుట హాజరుపరిచారు. వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. నిందితులు నేరం అంగీకరించడంతో కేసును కొట్టివేస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్‌లో చట్ట వ్యతిరేక పనులకు పాల్పడి, జీవితాలను నాశనం చేసుకోవద్దని తహసీల్దార్ హితవుపలికారు. ఒకవేళ ఆ పనులకు పాల్పడితే రూ.లక్ష జరిమానతో పాటు, చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గొర్రెల కాపరులను ఆదుకోవాలి

పాణ్యం: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గొర్రెల యజమానులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామచంద్రుడు డిమాండ్ చేశారు. శుక్రవారం బలపనూరు మెట్ట వద్ద చనిపోయిన గొర్రెలకు పోస్టుమార్టం చేసేందుకు వచ్చిన పశుసంవర్ధకశాఖ అధికారులతో మాట్లాడారు. ప్రమాదానికి కారకుడైన డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. సీఐటీయూ మండల కార్యదర్శి భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ కోతలు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు నగరంలో విద్యుత్ శాఖకు సంబంధించి అభివృద్ధి పనులు జరుగుతున్నందున ఈ నెల 29న వివిధ ఏరియాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని కర్నూలు టౌన్ డీఈఈ నాగప్రసాద్ తెలిపారు. సెంట్రల్ సెక్షన్ పరిధిలోని వడ్డెగేరి, కాంగ్రెస్ ఆఫీసు ఏరియా, హెడ్ పోస్టాఫీసు, ఎగ్జిబిషన్ గ్రౌండ్, దామోదరం సంజీవయ్య మున్సిపల్ హైస్కూల్, వెంకటేష్ సినీ కాంప్లెక్స్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. ఆయా ప్రాంతాల్లో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ కోతలు ఉంటాయని వెల్లడించారు.

పేదలకు అండగా నిలవడమే పీ-4 లక్ష్యం


మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): పేదలకు అండగా నిలవాలన్న లక్ష్యంతోనే పీ-4 కార్యక్రమాన్ని ఉగాది నుంచి ప్రారంభించనున్నట్లు కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో పేదరిక నిర్మూలనకు పీ-4 (పబ్లిక్-ప్రైవేట్-పీపుల్స్-పార్టనర్‌షిప్) విధానంపై స్టేక్ హోల్డర్లు, ఇండస్ట్రియల్ అసోసియేషన్‌లు, చాంబర్ ఆఫ్ కామర్స్, పారిశ్రామిక వేత్తలతో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. స్వర్ణాంధ్ర-2047లో భాగంగా ప్రభుత్వం పేదరికం లేని సమాజాన్ని తీర్చిదిద్దేందుకు పీ-4 కార్యక్రమాన్ని ప్రవేశపెట్టినట్లు చెప్పారు. ఆర్థికంగా ఉన్నత స్థితిలో ఉన్న 10 శాతం మంది.. అత్యంత పేదరికంలో ఉన్న 20 శాతం మందికి చేయూత ఇవ్వడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. వీరిని గుర్తించేందుకు ఫిబ్రవరి 25 నుంచి మార్చి 25వ తేదీ వరకు సర్వే నిర్వహించినట్లు చప్పారు. ఈ సర్వేలో గ్రామసభలు నిర్వహించి అత్యంత పేదరికంలో ఉన్న 20 శాతం మందిని గర్తించారని వివరించారు. పేదలకు అండగా నిలవాలనుకునే దాతలు, పారిశ్రామిక వేత్తలు, స్వచ్ఛంద సంస్థలు ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యేలు గౌరు చరితారెడ్డి, బీవీ జయనాగేశ్వరరెడ్డి, కేఈ శ్యామ్‌కుమార్, సీపీఓ ప్రభాకరరాజు పాల్గొన్నారు.


ప్రవక్త సందేశం సమాజానికి స్ఫూర్తిదాయకం

కర్నూలు (టౌన్): మహమ్మద్ ప్రవక్త ఇచ్చిన సందేశం సమాజానికి స్ఫూర్తి దాయకమని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ అతిథి గృహంలో మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముస్లింలకు ముందస్తు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కూటమి ప్రభుత్వం ముస్లింల సంక్షేమాన్ని ఎన్నో పథకాలను ప్రవేశ పెడుతోందన్నారు. జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా మాట్లాడుతూ.. శాంతి, సౌభ్రాతృత్వం గురించి మహమ్మద్ ప్రవక్త చెప్పిన సందేశాన్ని గుర్తు చేసుకుంటూ వారి స్ఫూర్తితో సమ సమాజ నిర్మాణానికి పాటుపడదామన్నారు. ప్రార్థనలు ముగిసిన తరువాత జిల్లా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు ముస్లిం మత పెద్దలతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఎమ్మెల్యేలు గౌరు చరితా రెడ్డి, కేఈ శ్యాంబాబు, బొగ్గుల దస్తగిరి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, ఎస్పీ విక్రాంత్‌పాటిల్, మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి సబీహా పర్వీన్, మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మహిళ ఆత్మహత్య

కర్నూలు (టౌన్): మూడవ పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో ఓ గుర్తు తెలియని మహిళ ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు.. స్థానిక స్వామిరెడ్డి నగర్‌లో నివాసం ఉంటున్న వంకాయల కోటమ్మను రెండు నెలల క్రితం షాహీనా అనే మహిళ కలిసింది. కొద్ది రోజులు ఇల్లు బాడుగకు ఇస్తే ఏదైనా పని చూసుకొని వెళ్లిపోతానని చెప్పింది. జాలిపడిన కోటమ్మ ఆ మహిళ వివరాలు తెలుసుకోకుండానే ఇంటిని బాడుగకు ఇచ్చింది. కోటమ్మ భర్త అనారోగ్యంతో నెల్లూరులో ఉండటంతో తరచూ అక్కడికి వెళ్లి వచ్చేది. శుక్రవారం ఉదయం 7 గంటలకు ఇంటి నుంచి దుర్వాసన వస్తోందని పొరుగు వారు కోటమ్మకు చెప్పారు. ఆమె ఇంటికి వచ్చి ఎంతగా పిలిచినా స్పందన లేకపోవడంతో తలుపులు బద్దలు కొట్టి చూశారు. లోపల సీలింగ్ ఫ్యాన్ హైపుకు మహిళ చీరతో ఉరి వేసుకుని కనిపించింది. శవం కుళ్లిపోయి ఉండటంతో వెంటనే మూడవ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతురాలి 5 అడుగుల ఎత్తు, తెలుపు వర్ణంతో ఉందని తెలిపారు. కుడి చేతిపై ఎం.లాజర్ అని పచ్చబొట్టు ఉందని, ఆచూకీ తెలిసిన వారు సీఐ 91211 01061 సెల్ నంబర్‌కు సమాచారం తెలియజేయాలని పోలీసులు కోరారు.

ఆప్కో మాజీ డైరెక్టర్ నాగలక్ష్మయ్య మృతి



కల్లూరు: ఆప్కో మాజీ డైరెక్టర్, కల్లూరు మాజీ సర్పంచ్ పోలిశెట్టి నాగలక్ష్మయ్య (74) తుదిశ్వాస విడిచారు. కొద్ది రోజులు గా అనారోగ్యంతో బాధ పడుతున్న ఆయన శుక్రవారం సాయంత్రం మృతి చెందారు. నాగలక్ష్మ య్య 1987 నుంచి 1995 వరకు కల్లూరు మేజ ర్ గ్రామ పంచాయ తీ సర్పంచ్‌గా ఉన్నారు. 25 ఏళ్లు ఆప్కో డైరెక్టర్‌గా పనిచేసి అందరి మన్ననలు పొందారు. అఖిల భారత తొగట వీర క్షత్రీయ సేవా సంఘం చౌడేశ్వరీదేవి వసతి సముదాయం శ్రీశైల సత్రానికి అధ్యక్షుడిగా సేవలందించారు. ఆయ న మృతిపై పలువురు సంతాపం తెలిపారు. శనివారం ఉదయం కల్లూరు ఎస్టేట్‌లో ని ఆయన స్వగృహం నుంచి అంతిమయాత్ర ప్రా రంభమై కల్లూరు శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు,కార్పొరేటర్ సానా శ్రీనివాసులు తెలిపారు.

పండుగ రోజుల్లోనూ పన్ను చెల్లింపు

కర్నూలు (టౌన్): ఈనెల 30, 31న పండుగ రోజుల్లోనూ మున్సిపల్ ఆస్తి పన్ను, నీటి పన్నులను చెల్లించవచ్చని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 31వ తేదీతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఆది, సోమవారం ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు నగరపాలక సంస్థ కార్యాలయాల్లో పన్ను వసూళ్ల కేంద్రాలతో పాటు నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లలో పన్నులు చెల్లించవచ్చని వెల్లడించారు. అలాగే ప్రజలు ఇంటి వద్ద నుంచే పన్నులను డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా చెల్లించవచ్చని, వాట్సప్ నంబర్ 95523 00009, అలాగే పురసేవ యాప్, వెబ్‌సైట్ https://cdma.ap.gov.in చెల్లించవచ్చన్నారు. అలాగే కల్లూరు వార్డు కార్యాలయం (85వ సచివాలయం), జేఎస్ఆర్ నగర్ (సి.క్యాంపు రైతుబజార్ సమీపంలో 62వ సచివాలయం), బాలాజీనగర్ 104 వ సచివాలయంలలో పన్నులు చెల్లించవచ్చని వెల్లడించారు.


ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



పాఠశాలలో డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

గడివేముల: స్థానిక రాజరాజేశ్వరి ఉన్నత పాఠశాల ఆడిటోరియంలో శుక్రవారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహించారు. ఐదో తరగతి విద్యార్థులకు పాఠశాల కరస్పాండెంట్ ఎం.రామేశ్వరరావు, ఏఓ రాఘవేంద్రరావు, ఉపాధ్యాయుల చేతుల మీదుగా గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లను అందజేశారు. విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోవాలంటే క్రమశిక్షణ, అంకితభావం, పట్టుదల ముఖ్యమన్నారు.

ప్రైవేటు ఆసుపత్రుల తనిఖీ


ప్రైవేటు ఆసుపత్రిని తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.శాంతికళ

కర్నూలు(హాస్పిటల్): జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.శాంతికళ శుక్రవా రం సాయంత్రం నగరంలోని మెడికవర్, శివానీ హాస్పిట ల్స్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్పిటల్, స్కానింగ్ కేంద్రంలోని రికార్డులు, రిపోర్టులు పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలోని హాస్పిటల్స్, స్కానింగ్ కేంద్రాల యాజమాన్యా లు రికార్డులు, రిపోర్టులను నిబంధనల ప్రకారం నిర్వహించాలని, వైద్యుల అర్హత సర్టిఫికెట్లు, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు ప్రదర్శించాలని సూచించారు. గర్భస్థ పిండం లింగ నిర్ధారణ పరీక్షలు చేయరాదని, అలా చేస్తే పీసీ పీఎన్‌డీటీ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆమె వెంట డెమో శ్రీనివాసులు శెట్టి, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, ఆరోగ్య విద్యాబోధకులు పద్మావతి, మానిటరింగ్ కన్సల్టెంట్ సుమలత ఉన్నారు.